సాక్షి
హనుమకొండ

మంగళవారం । 4 । జూలై । 2023

న్యూస్‌రీల్

రేపట్నుంచి పీజీ సెకండియర్ రెండో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: ఈనెల 5వ తేదీ నుంచి ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ, ఎంటీఎం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంహెచ్‌ఆర్‌ఎం, జర్నలిజం తదితర కోర్సుల సెకండియర్ రెండో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్.జ్యోతి తెలిపారు. ఈనెల 5, 7, 10, 12, 14, 18 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈపరీక్షల నిర్వహణకు 32 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 5,819 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

సివిల్స్‌లో కోచింగ్

న్యూశాయంపేట: మైనార్టీ సంక్షేమశాఖ, తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్ అండ్ కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో సివిల్స్ కోసం సన్నద్ధమవుతున్న మైనార్టీ అభ్యర్థులకు ఉచితంగా కోచింగ్ అందించనున్నట్లు హనుమకొండ జిల్లా మైనార్టీ సంక్షేమశాఖాధి మేన శ్రీను సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13 వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఈటీ.సీజీజీ.జీఓవీ.ఇన్ ట్రిమిస్‌లో సమర్పించాలని సూచించారు. వివరాలకు హనుమకొండ సుబేదారి కలెక్టరేట్ కాంప్లెక్స్ 2వ అంతస్తులోని కార్యాలయంలో లేదా 040–23236112 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు. స్క్రీనింగ్ టెస్ట్ ఈనెల 23న అన్ని జిల్లా కేంద్రాల్లోని మైనార్టీ గురుకులాల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

8 ప్యాసింజర్ రైళ్లు రద్దు

కాజీపేట రూరల్: రైల్వే ట్రాక్ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో 8 ప్యాసింజర్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు సోమవారం దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. కాజీపేట జంక్షన్, వరంగల్ మీదుగా వివిధ మార్గాల్లో ప్రయాణించే పలు ప్యాసింజర్ రైళ్లను జూలై 3 నుంచి 9వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రద్దయిన రైళ్లు ఇవే..

కాజీపేట–డోర్నకల్ (07753) ప్యాసింజర్, డోర్నకల్–కాజీపేట (07754), కాజీపేట–సిర్పూర్ (17003), బల్లార్షా–కాజీపేట (17004), సికింద్రాబాద్–వరంగల్ (07462) పుష్‌పుల్, వరంగల్–హైదరాబాద్ (07463) పుష్‌పుల్, కాజీపేట–బల్లార్షా (17035) రామగిరి, బల్లార్షా–కాజీపేట (17036) రామగిరి ప్యాసింజర్లను రైల్వే అధికారులు రద్దు చేశారు. కాగా.. కాజీపేట రైల్వే అధికారులు ఎంక్వైరీ కౌంటర్ కార్యాలయం డిస్‌ప్లేపై రద్దయిన రైళ్ల వివరాలను ప్రయాణికుల కోసం ప్రకటించారు.

పోడు పట్టాల పంపిణీపై సీఎస్ సమీక్ష



కాజీపేట/వరంగల్: హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో పోడుభూముల పట్టాల పంపిణీ పురోగతిపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం రాత్రి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పట్టాల పంపిణీ ఎంతవరకు వచ్చింది? లబ్ధిదారులు తదితర అంశాలపై చర్చించారు. అదేవిధంగా గృహలక్ష్మి పథకం, ఎరువులు విత్తనాల నిల్వలు, హరితహారం, బీసీ చేతివృత్తుల వారికి రుణాల పంపిణీ, గొర్రెల పంపిణీ వంటి పథకాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆదేశించారు. వీసీలో ఆయా జిల్లాల కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు పాల్గొన్నారు.

జిల్లా గణాంక దర్శిని విడుదల

కాజీపేట: హనుమకొండ జిల్లా గణాంక దర్శిని పుస్తకాన్ని సోమవారం రాత్రి కలెక్టరేట్‌లో కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక ప్రణాళిక విధాన రూపకల్పనలో గణాంక దర్శిని అత్యంత ముఖ్యమైందన్నారు. కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి సత్యనారాయణరెడ్డి, డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌కుమార్, డీపీఓ జగదీశ్‌తోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీంకు దరఖాస్తుల స్వీకరణ

కాజీపేట అర్బన్: హనుమకొండ జిల్లాలోని ఎస్సీ విద్యార్థుల నుంచి 2023–24 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీంలో భాగంగా 1, 5వ తరగతిలోకి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి నిర్మల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1వ తరగతికి 87 సీట్లు, 5వ తరగతికి 88 సీట్లు కేటాయించామని, ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 15వ తేదీలోపు దరఖాస్తులు అందించాలని పేర్కొన్నారు. దరఖాస్తులు అంబేడ్కర్ భవన్‌లోని ఎస్సీ హాస్టల్‌లో, హసన్‌పర్తిలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో అందుబాటులో ఉన్నట్లు, ఈఅవకాశాన్ని సద్వినియోగించుకోవాలని ఆమె సూచించారు.





సాయిబాబాకు అభిషేకాలు

వరంగల్ ఎల్లంబజార్‌లోని సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలను సోమవారం నిర్వహించారు. ఉదయం సాయిబాబా విగ్రహాన్ని పలు రకాల పూలు, పుష్పాలు, పండ్లు, సుగంధ ద్రవ్యాలతో అలంకరించి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం 24 గంటల పాటు 'ఓం సాయి శ్రీ సాయి జయసాయి జయసాయి' అనే ఏకనామ జపాన్ని పఠించారు. కార్యక్రమంలో సాయి సేవాదళ్ సభ్యులు ఆరుట్ల శ్రీనివాస్, మోహన కృష్ణ, నాగేశ్వర్‌రావు, వేముల శ్రీనివాస్, కొడితాల శివకుమార్ పాల్గొన్నారు.

- రామన్నపేట





భద్రకాళీ.. శరణం మమ

మహా శాకంబరిదేవిగా దర్శనం..

భద్రకాళి దేవాలయంలో తిథి మండల దేవాతాయజన పూర్వక శాకంబరి నవరాత్రోత్సవాల చివరిరోజు సోమవారం అమ్మవారిని మహా శాకంబరిదేవిగా అలంకరించారు. అలంకరణలో నాలుగు టన్నుల కూరగాయలు, పండ్లు, దుంపలను వినియోగించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. గత నెల 19వ తేదీన ఉత్సవాలు ప్రారంభమై పక్షం రోజులుగా ఒక్కో క్రమంలో పూజలందుకుంటూ ఆషాఢ శుద్ధ పౌర్ణమి సోమవారం అమ్మవారు పరిపూర్ణ శాకంబరిదేవిగా భక్తులను అనుగ్రహించింది.

- హన్మకొండ కల్చరల్

- వివరాలు 8లో▸

నిలకడగా భూగర్భ జలాలు

వినియోగం లేకపోవడమే ప్రధాన కారణం

- జిల్లాలో సగటున 6.70 మీటర్ల లోతుల్లో జలాలు
- ఐనవోలులో అధికంగా 21.05 మీటర్ల లోతుల్లో..
- ధర్మసాగర్‌లో పైపైనే 2.40 మీటర్లలో..
- గత నెలతో పోలిస్తే స్వల్పంగా పడిపోయిన జలాలు



హన్మకొండ: హనుమకొండ జిల్లాలో సగటు భూగర్భ జలాలు నిలకడగా ఉన్నాయి. గత నెలతో పోలిస్తే స్వల్పంగా పడిపోయినట్లు తెలుస్తోంది. వర్షాలు లేకపోయినా స్వల్ప తగ్గుదలతో నిలకడగానే కనిపిస్తున్నాయి. ఈఏడాది ఆశించినంతగా వర్షాలు కురవట్లేదు. ప్రస్తుతం తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో సాగు పూర్తిగా వెనుకబడింది. వరి సాగు మొదలు కాలేదు. దీంతో ఇప్పటి వరకు భూగర్భ జలాలు తోడకపోవడంతో నిలకడగానే కనిపిస్తున్నాయి. మే నెలతో పోలిస్తే జూన్ మాసాంతానికి జిల్లాలో సగటున భూగర్భ జలాలు 0.59 మీటర్లకు పడిపోయాయి. జిల్లాలో సగటున మే మాసాంతంలో 6.11 మీటర్ల లోతుల్లో భూగర్భ జలాలుండగా.. ప్రస్తుతం 6.70 మీటర్ల లోతుల్లో ఉన్నాయి.

కొన్ని లోతుకు.. మరికొన్ని పైపైనే..

జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలాలు అత్యధిక లోతుకు పడిపోయాయి. మరికొన్ని ప్రాంతాల్లో భూగర్భజలాలు పై పైనే ఉన్నాయి. మే మాసాంతంతో చూసుకుంటే జూన్ మాసాంతానికి గ్రామాల్లో భూగర్భ జలాలు స్వల్పంగా పడిపోయాయి. ధర్మసాగర్‌లో 2.40 మీటర్ల లోతుల్లో పైనే ఉన్నాయి. హనుమకొండ జిల్లాలో భూగర్భజలాల పరిస్థితులు ప్రతీ నెలా తెలుసుకోవడానికి 25 ప్రాంతాల్లో బోరు వేసి ఫీజో మీటర్లు అమర్చారు. భూమిలో భూగర్భ జలాల హెచ్చుతగ్గులను ఫీజో మీటర్లు రికార్డు చేస్తాయి. వీటిలో నమోదైన కొలతలను ప్రతి నెలా చివరి వారంలో తీసుకుని ప్రభుత్వానికి భూగర్భ జలాల వివరాలు పంపుతారు. జిల్లాలో భీమదేవరపల్లి మండలం జగన్నాథపురంలో 14.85 మీటర్లు, వంగరలో 10.80 మీటర్లు, కొత్తపల్లిలో 9.80 మీటర్లు, ధర్మసాగర్ మండలం పెద్ద పెండ్యాలలో 9.85 మీటర్ల అడుగున భూగర్భ జలాలున్నాయి.

జిల్లాలో భూగర్భ జలాల వివరాలు (లోతు మీటర్లలో)

గ్రామం	మార్చి	ఏప్రిల్	మే	జూన్
గట్లనర్సింగాపూర్	7.50	8.60	4.20	6.05
జగన్నాథపూర్	14.10	14.05	14.78	14.85
కొత్తపల్లి	10.72	9.30	8.75	9.80
వంగర	11.30	11.60	10.75	10.80
ధర్మాపూర్	6.30	6.30	5.55	5.55
ధర్మసాగర్	2.40	2.30	2.20	2.40
పెద్ద పెండ్యాల	8.20	9.80	8.75	9.85
నారాయణగిరి	8.00	4.95	3.65	5.4
ఎల్కతుర్తి	8.90	8.80	8.10	8.50
హనుమకొండ	8.51	6.90	6.30	6.70
నాగారం	6.50	4.15	3.40	5.83
సీతంపేట	2.06	2.72	2.40	3.90
ఎల్లాపూర్	4.40	3.16	3.47	3.80
ఐనవోలు	16.10	26.20	25.60	21.05
పున్నేలు	3.17	3.80	4.10	5.50
పంథిని	2.88	3.17	3.37	3.75
శనిగరం	2.35	2.56	1.80	2.70
పీచర	12.00	14.75	7.40	8.75
వేలేరు	6.20	7.60	6.55	5.6
ఆత్మకూరు	3.40	2.60	2.30	2.75
దామెర	3.90	4.60	4.10	4.50
చెర్లపల్లి	7.90	6.10	5.60	7.85
నడికూడ	4.10	1.10	1.60	2.80
పరకాల	5.50	4.50	4.00	4.70
పత్తిపాక	3.80	4.20	3.95	4.12

తెలంగాణ మీ జాగీరా?

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

హన్మకొండ: 'తెలంగాణ మీ జాగీరా? ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని రావొద్దనడానికి మీరెవరు' అని బీఆర్‌ఎస్ నేతలనుద్దేశించి బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని వేద బాంక్వెట్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నాయకులు కేంద్రంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కోచ్ ఫ్యాక్టరీకి 2 వేల ఎకరాలు అవసరమని కేంద్రం అడిగితే అంత భూమి ఇవ్వలేమని రాత పూర్వకంగా మీరు ఇచ్చింది నిజం కాదా? అని నిలదీశారు. దీనిపై సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, స్థానిక ఎమ్మెల్యేలైనా చర్చకు రావాలని సవాల్ విసిరారు. దేశం మొత్తం మీద ఏడు టెక్స్‌టైల్ పార్కుల్లో ఒక్కటి వరంగల్‌కు ఇస్తే ఇంతవరకు ఫార్మాలిటీస్ ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. గిరిజన యూనివర్సిటీకి కేంద్రం బడ్జెట్ కేటాయించినా.. రాష్ట్ర ప్రభుత్వం స్థలం మాత్రం ఇవ్వడం లేదని విమర్శించారు. ఎయిర్‌పోర్టుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం ల్యాండ్ ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రంలో అబద్ధాలు, అరాచకాలు పెరిగిపోయాయని, మంత్రులు పర్యటనకు వచ్చినా.. ప్రజలను నిర్బంధిస్తున్నారని ధ్వజమెత్తారు. బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ మాట్లాడుతూ.. మడికొండ మెట్టుగుట్ట వద్ద వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ ఏడెకరాలు కబ్జా చేశాడని, ఇలా నియోజకవర్గంలో 1500 ఎకరాలు కబ్జా చేసి ఎక్కడికక్కడ గెస్ట్ హౌజ్‌లు నిర్మించుకుని సెటిల్‌మెంట్లు చేస్తున్నట్లు ఆరోపించారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ వి.మురళీధర్‌గౌడ్, నాయకులు కంగట్ల సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

హెలిపాడ్‌పనుల పరిశీలన

మామునూరు: ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా మామునూరు విమానాశ్రయంలో ముళ్లపొదలు, పిచ్చిమొక్కల తొలగింపు, సుందరీకరణ పనులు, హెలిపాడ్ ఏర్పాట్ల పనులు శరవేగంగా సాగుతున్నాయి. సోమవారం నాయకులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు ఎయిర్‌పోర్ట్‌ను సందర్శించి హెలిపాడ్, సుందరీకరణ పనులు పరిశీలించారు. వారివెంట జలగం రంజిత్, మల్లాడి తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ..

- పలువురికి తీవ్ర గాయాలు
- క్యాబిన్‌లో చిక్కుకున్న బస్సు డ్రైవర్
- కాపాడిన స్థానికులు
- లారీ డ్రైవర్ పరిస్థితి విషమం



బస్సు డ్రైవర్‌ను బయటకు తీస్తున్న స్థానికులు

దామెర: వేగంగా వచ్చిన ఓ లారీ.. ఆర్టీసీ బస్సును ఎదురుగా ఢీకొంది. ఈ ప్రమాదంలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈఘటన సోమవారం ఉదయం హనుమకొండ జిల్లా దామెర మండలం ఓగ్లాపూర్ సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పరకాల డిపోకు చెందిన ఏపీ 36 జెడ్ 0256 నంబర్‌గల ఆర్టీసీ బస్సు బెల్లంపల్లి నుంచి హనుమకొండకు వెళ్తోంది. హనుమకొండ నుంచి పరకాల వైపునకు వస్తున్న టీఎస్ 07 యూసీ 8979 నంబర్‌గల లారీ ఒగ్లాపూర్ సమీపంలో జాతీయ రహదారిపై బస్సును ఎదురుగా ఢీకొంది. దీంతో బస్సులోని ప్రయాణికులు ఒక్కసారిగా ముందుకు పడ్డారు. ఈసమయంలో బస్సులో 57 మంది ప్రయాణికులు ఉండగా.. సుమారు ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మరో 20 మందికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసం కావడంతో డ్రైవర్ భద్రయ్య క్యాబిన్‌లో ఇరుక్కున్నాడు. పోలీసులు, స్థానికులు సుమారు 20 నిమిషాల పాటు శ్రమించి అతడిని బయటకు తీశారు. అదే విధంగా లారీ డ్రైవర్, ఆర్టీసీ బస్ డ్రైవర్‌తోపాటు మరో ఐదుగురు ప్రయాణికులకు తీవ్ర గాయాలవడంతో 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. స్వల్ప గాయాలైన వారిని దామెర క్రాస్‌లోని ఎస్‌ఎస్‌ఆర్ అపోలో రీచ్ ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహించారు. కాగా.. లారీ డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. జాతీయ రహదారిపై ప్రమాదం జరగడంతో రహదారికి ఇరువైపులా.. కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో ఎస్సై రాజేందర్ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఘటనా స్థలికి పరకాల ఏసీపీ జూపల్లి శివరామయ్య, పరకాల రూరల్ సీఐ శ్రీనివాసరావు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బస్సు కండక్టర్ భాస్కర్ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

గౌరవెల్లి నీరందించడంలో ప్రభుత్వం విఫలం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి
- పలు గ్రామాల్లో 'పల్లె ముచ్చట్లు' కార్యక్రమం



పీవీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న చాడ వెంకట్‌రెడ్డి

ఎల్కతుర్తి: గౌరవెల్లి ప్రాజెక్టు ద్వారా మెట్ట ప్రాంతమైన భీమదేవరపల్లికి సాగు నీరందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. భీమదేవరపల్లి మండలంలోని మాణిక్యాపూర్, గాంధీనగర్, రత్నగిరి, వంగర, ముల్కనూరు, కొత్తపల్లి గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. 'పల్లె ముచ్చట్లు' కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల సమస్యలు తెలుసుకొని మాట్లాడారు. భీమదేవరపల్లి మండలంలో 20 గ్రామాలు ఉండగా.. పలు గ్రామాల్లో అనేక సమస్యలున్నాయని వాటిని పరిష్కరించడంలో పాలకులు విఫలమయ్యారని మండిపడ్డారు. ఇప్పటికీ అర్హులకు వృద్ధాప్య, వింతంతు పింఛన్ రాకపోవడం బాధాకరమన్నారు. మండలంలోని ఎనిమిది గ్రామాలకు కాలువలు ఏర్పాటు చేసి నీరందించాల్సి ఉండగా.. ఇప్పటి వరకు మండలంలో కాలువల నిర్వహణ కోసం భూసేకరణ చేపట్టిన దాఖలాలు లేవన్నారు. పలు గ్రామాల్లో వీధి లైట్లు లేక ప్రజలు చీకటిలో గడుపుతున్నారన్నారు. పలుమార్గాలో రోడ్లులేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ధరణి పోర్టల్‌లో ఉన్న లోపాలు సవరించాలని దీంతో రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం సమీక్ష నిర్వహించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు హెచ్చరించారు. అలాగే.. ప్రభుత్వ భూములను పేద ప్రజలకు పింపిణీ చేయాలని 58వ జీఓ ప్రకారం గుడిసెవాసులకు పట్టాలు అందజేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం వంగరలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు అదారి శ్రీనివాస్, మంచాల రమాదేవి, తిరుపతి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరాజం, రవి, యాదగిరి, సుంచు కుమారస్వామి, ఉమ, మౌనిక, పద్మ, మమత తదితరులు పాల్గొన్నారు.

స్కాంలను పరిచయం చేసింది కాంగ్రెస్సే : కడియం



మాట్లాడుతున్న కడియం శ్రీహరి, చిత్రంలో వినయ్ భాస్కర్, సుందర్‌రాజ్

నయీంనగర్: దేశంలో స్కామ్‌లను పరిచయం చేసింది కాంగ్రెస్ పార్టీనే అని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి ఆరోపించారు. సోమవారం హనుమకొండ హరిత హోటల్‌లో ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. జాతీయ పార్టీకి జాతీయ విధానం ఉండాలి కానీ రాష్ట్రానికో విధానం కాదన్నారు. రాహుల్‌గాంధీకి కనీస పరిజ్ఞానం లేక ఎవరో రాసిన స్క్రిప్టు చదువుతూ రూ.80వేల కోట్లతో కట్టిన ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందంటున్నారని ఎద్దేవా చేశారు. డీపీఆర్ లేకుండా కాజీపేటలో పిరియాడికల్ ఓవరాలింగ్ యూనిట్ ఏర్పాటకు శంకుస్థాపన చేయడం అంటే వరంగల్ ప్రజలను మోసం చేయడమేనన్నారు. వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తెలంగాణకు చేసిందేమీలేదన్నారు. కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ పాల్గొన్నారు.

దసరా రోజున అందుబాటులోకి తేవాలి

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు
- సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులపై సమీక్ష



నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

ఎంజీఎం: వరంగల్ సెంట్రల్ జైలు ప్రాంగణంలో రూ.1,100 కోట్లతో 24 అంతస్తుల్లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి దసరా పండుగ రోజున ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా చూడాలని మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులపై సమీక్షించారు. ఈసందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. ప్రస్తుతం 10 అంతస్తుల నిర్మాణం పూర్తయ్యిందని, ఆర్‌అండ్‌బీ అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సమన్వయంతో రోగులకు వైద్య చికిత్సలు అందించే పరికరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ఆస్పత్రిలో 14 అంతస్తుల వరకు చికిత్స చేసే వార్డులు ఉంటాయని, మిగతా 10 అంతస్తుల్లో సెమినార్ హాళ్లు, వైద్యవిద్యకు సంబంధించిన ఏర్పాట్లు ఉంటాయని తెలిపారు. రెండు, మూడు నెలల్లో పూర్తి స్థాయిలో 10 అంతస్తుల్లో అన్ని పరికరాలు నెలకొల్పి ఆస్పత్రిని దసరా రోజున అందుబాటులోకి తేవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి



విద్యార్థులతో మట్లాడుతున్న సిరికొండ మధుసూదనాచారి

శాయంపేట: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. మండలంలోని గట్లకనిపర్తిలో నాగార్జున పబ్లిక్ పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. విద్యార్థులకు గురుపౌర్ణమి ఆవశ్యకతను వివరించారు. అనంతరం సూరంపేటలోని కమ్యూనిటీ భవన నిర్మాణం పూర్తి చేయడానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. నర్సింహులపల్లి గ్రామంలోని అభయాంజనేయ స్వామి ఆలయాన్ని దర్శించుకోగా.. ఆలయ అర్చకులు గూడా వాసుదేవమూర్తి పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు బొమ్మ కంటి సాంబయ్య, త్రిపురాల లక్ష్మి, బోలెద్ల రజిత రఘుపతిరెడ్డి, బైరి శ్రీనివాస్, ఎంపీటీసీ బత్తిని రజినిసత్యం, కో–ఆప్షన్ సభ్యులు గుర్రం అశోక్, మాజీ వైస్ ఎంపీపీ వంగాల నారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎర్రబెల్లికి కేసీఆర్ ఆశీస్సులు..



దేవరుప్పుల: పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తన జన్మదినాన్ని (మంగళవారం) పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్.. మంత్రి ఎర్రబెల్లికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఆశీస్సులు అందించారు. అలాగే కేబినేట్ సమావేశం అనంతరం మంత్రి కేటీఆర్ కూడా మంత్రి ఎర్రబెల్లి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ఏటా తన జన్మదిన వేడుకలను విదేశాల్లో జరుపుకుంటున్న మంత్రి దయాకర్‌రావు.. సోమవారం రాత్రి అమెరికా బయలుదేరారు.

బాలికను రక్షించిన రక్షక దళం

కాజీపేట రూరల్ : ప్రభుత్వ హాస్టల్‌లో చదువుకుంటున్న ఓ బాలిక.. (9వ తరగతి) రైలు కింద పడి చనిపోతానని సోమవారం కాజీపేట దర్గా రైల్వే గేట్ సమీపానికి చేరుకుంది. రైలు ట్రాక్‌పైకి వస్తున్న ఆ బాలికను రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు గమనించి రక్షించారు. అనంతరం విషయం తెలుసుకున్నారు. 'ఇంట్లో అమ్మ తిడుతుంది. నాన్న చనిపోయాడు. నాకు చదువు కోవాలని ఉంది. నన్ను భరోసా సెంటర్‌కు పంపించండని' కోరింది. ఆ వివరాలు నోట్ చేసుకున్న కాజీపేట ఆర్‌పీఎఫ్ సీఐ సంజీవరావు.. బాలిక బంధువులను పిలిచి వారి సమక్షంలో 1098 చైల్డ్‌లైన్‌కు అప్పగించారు.

బీసీలు ఎదగకుండా కుట్ర..

నయీంనగర్: బీసీలు రాజకీయంగా ఎదగకుండా కుట్రలు జరుగుతున్నాయని తెలంగాణ బీసీ సంఘాల ఉద్యమకారులు అన్నారు. ఈ మేరకు సోమవారం హన్మకొండ హరిత హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇందూర్ జిల్లాలో కొందరు బీఆర్‌ఎస్ నాయకులు.. బీసీ కులాలను కించపరిచేలా వ్యాఖ్యానించడం సరికాదన్నారు. ముదిరాజ్ కుటుంబాలను సామాజిక బహిష్కరణ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. బీసీలు రాజకీయంగా ఎదగకుండా ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి వంటి వారిని ప్రభుత్వమే ప్రోత్సహిస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల జగదీశ్వర్ ప్రసాద్, పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకుడు చందా మల్లయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పాశికంటి రాజేంద్రప్రసాద్, రజక సంఘం నాయకుడు లక్ష్మీనారాయణ, నాయీ బ్రహ్మణ సంఘం నాయకులు సురేష్, పాల్గొన్నారు.

భద్రకాళీ.. శరణం మమ

మహా శాకంబరిదేవిగా దర్శనం..
● ముగిసిన ఉత్సవాలు
● పులకించిన భక్తులు



హోమం మహాపూర్ణాహుతి



సీపీ దంపతులకు శేషవస్త్రాలు అందజేస్తున్న ఈఓ

హన్మకొండ కల్చరల్ : వరంగల్ భద్రకాళి దేవాలయంలో శాకంబరీ నవరాత్రోత్సవాల చివరిరోజు సోమవారం ఉదయం అమ్మవారిని మహాశాకంబరిదేవిగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని భద్రకాళి శరణం మమ అంటూ పులకించిపోయారు. ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో ముఖ్య అర్చకులు పార్నంది నరసింహామూర్తి, చెప్పెల నాగరాజుశర్మ , టక్కరసు సత్యం, సోమసుందరశర్మ తదితరులు అలంకరణలో పాల్గొన్నారు. ఉదయం మిత్రాక్రమంలో, చిత్రాక్రమాలలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని మహాశాకంబరీదేవిగా అలంకరించి మహాహారతి, పంచహారతి, మహానివేదన జరిపారు. శాకంబరీ అలంకరణలో ఐదు టన్నుల 80 రకాల దుంపలు, కాయలు, ఆకు కూరలు, కూరగాయలు, 70 రకాల పండ్లను వినియోగించారు. మండువ శేషగిరిరావు, రేణుక దంపతులు, హైదరాబాద్‌కు చెందిన ఈమని హరికృష్ణ , స్మిత దంపతులు శాకంబరీ అలంకరణ దాతలుగా వ్యవహరించారు. ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ శేషభారతి, సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్, సిబ్బంది నాగులు, చింత శ్యామ్‌సుందర్, ఇతర సిబ్బంది ఏర్పాట్లను నిర్వహించారు. భద్రకాళి సేవాసమితి అధ్యక్షుడు అయితా గోపినాథ్, సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

ప్రముఖుల సందర్శన..

ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ రేవతి దంపతులు, మేయర్ గుండు సుధారాణి దంపతులు, హనుమకొండ జిల్లా న్యాయమూర్తి కృష్ణమూర్తి, నగర సీపీ రంగనాథ్ దంపతులు, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌- పద్మ దంపతులు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆలకిస్తూ.. ఆదేశిస్తూ

● ఫిర్యాదులు స్వీకరించిన బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయానికి వచ్చిన అర్జీదారుల గోడును బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఓపికగా విన్నారు. సంబంధిత విభాగాధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా దరఖాస్తులు స్వీకరించారు. గ్రీవెన్స్‌సెల్‌కు మొత్తం 87 ఫిర్యాదులు రాగా.. అందులో టౌన్‌ప్లానింగ్ విభాగానికి 31, ఇంజనీరింగ్ సెక్షన్‌కు 21, తాగునీటి సరఫరాకు 14, పన్నుల విభాగానికి 12, ప్రజారోగ్యానికి 7, ఎలక్ట్రికల్ సెక్షన్‌కు 2 చొప్పున నమోదయ్యాయి.

అత్యంత ప్రాధాన్యం ఇవ్వండి..

గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్ సెల్‌లో అందిన ప్రతీ ఫిర్యాదును ప్రాధాన్యంగా తీసుకుని పరిష్కారం చూపాలని బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం గ్రీవెన్స్ సెల్ అనంతరం అధికారులు, సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. గ్రీవెన్స్ సెల్‌కు విచ్చేసిన ప్రతీ ఫిర్యాదును సమయంతో సంబంధం లేకుండా స్వీకరించాలన్నారు. ప్రతీ నెల మూడో శనివారం అడిషనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, ఎస్‌ఈలు, గ్రీవెన్స్ సంబంధిత అంతర్గత సమాచారం ఏర్పాటు చేస్తూ రిజిస్టర్లలో నమోదు చేసుకొని సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. 2017–18 నుంచి 2021–22 వరకు సెస్ సంబంధిత సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు రవీందర్‌యాదవ్, అనిసుర్ రషీద్, ఆర్‌ఎఫ్‌ఓ పాపయ్య, ఎస్‌ఈలు కృష్ణారావు, ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్‌ఓ రాజేశ్, సిటీ ప్లానర్ వెంకన్న, సీహెచ్‌ఓ శ్రీనివాసరావు, డీఎఫ్‌ఓ శంకర్ లింగం, డిప్యూటీ కమిషనర్లు జోనా, శ్రీనివాస్‌రెడ్డి,ఎంహెచ్‌ఓ జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషనర్

హత్య కేసులో ఇద్దరి రిమాండ్

బచ్చన్నపేట: మండలంలోని పోచన్నపేట గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్య హత్య కేసులో మరో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జనగామ ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం బచ్చన్నపేట పోలీస్ స్టేషన్‌లో నర్మెట సీఐ నాగబాబుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రామకృష్ణయ్య హత్యకు సహకరించిన గోపాల్‌నగర్ చెందిన పస్తం ధర్మయ్య, పస్తం జగన్నాథంను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కేసు విచారణను వేగవంతం చేస్తున్నామని, త్వరలోనే మరికొంత మందిని కూడా అరెస్ట్ చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్సై శ్రవణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మరణంలోనూ వీడని బంధం..

● గంట వ్యవధిలోనే అన్నదమ్ముల మృతి



కొమురయ్య గౌడ్ (ఫైల్)



సదానందం గౌడ్ (ఫైల్)

ఖిలా వరంగల్: ఒకే తల్లికి జన్మించిన అన్నదమ్ముల అనుబంధం చాలా గొప్పది. అన్న కాలుకి ముల్లుకు చ్చుకుంటే తమ్ముడు.. తమ్ముడి కంట్లో నలుసు పడితే అన్న విలవిలాడుతారు. కష్టసుఖాల్లో ఇరువురు పాలు పంచుకుంటూ అన్యోన్యంగా ఉంటారు. అలాంటి వీరి బంధాన్ని ఎవరూ విడదీయలేరు. చివరకు మరణం కూడా. దీనికి నిదర్శనమే ఈ ఘటన. వరంగల్ గణేశ్‌నగర్‌కు చెందిన ఉమ్మగాని కొమురయ్య గౌడ్ (80), వరంగల్ ఎల్‌బీనగర్ తిలక్ రోడ్డుకు చెందిన ఉమ్మగాని సదానందం గౌడ్ (65) అన్నదమ్ములు. వీరు గీత (గౌడ) వృత్తిని చేపట్టి కుటుంబాలను చక్కగా పోషించుకునే వారు. వారికి జన్మించిన పిల్లలను ఉన్నతంగా చదివించారు. కుమార్తెలు, కుమారుల వివాహం చేయగా వారు ప్రస్తుతం ఉన్నత స్థానంలో స్థిరపడ్డారు. ఈ క్రమంలో వృద్ధాప్యంలో తాము సంతోషంగా ఉండాలని కోరుకునే సమయాన ఇటీవల అన్నదమ్ములు అనారోగ్యానికి గురయ్యారు. వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి కొమురయ్య మృతిచెందగా.. గంట వ్యవధిలోనే తమ్ముడు సదానందం తుది శ్వాస విడిచాడు. దీంతో మరణంలోనూ అన్నదమ్ముల బంధం వీడిపోలేదని పలువురు కన్నీటి పర్యంతమయ్యారు. కాగా, ఈ విషయం తెలిసిన ఎమ్మెల్యే నరేందర్ సోమవారం కార్పొరేటర్ గుండేటి నరేందర్‌తో కలిసి మృతదేహాలను సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుల కుటంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

వృద్ధులపై మానవత్వం చూపాలి



మాట్లాడుతున్న డీసీపీ పుష్ప

వరంగల్ క్రైం: సమస్యల పరిష్కారానికి పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వయోవృద్ధులపై మానవతా దృక్పథంతో వ్యవహరించాలని పరిపాలనా విభాగం డీసీపీ పుష్ప సూచించారు. సోమవారం పోలీస్ కమిషనరేట్‌లో పోలీస్‌స్టేషన్ హౌజ్ అధికారులతో హెల్పేజ్ ఇండియా, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'తల్లిదండ్రులు, వయో వృద్ధుల పోషణ సంరక్షణ చట్టం–2007 'పై అవగాహన నిర్వహించారు. డీసీపీ పుష్ప మాట్లాడుతూ.. వయోవృద్ధులపై రోజుకో అఘాయిత్యం జరుగుతోందని, చాలా మంది నిరాదరణకు గురవుతున్నారన్నారు. వృద్ధుల ఆరోగ్య సామాజిక ఆర్థిక, పరిపుష్టికి కుటుంబ సభ్యులు పూర్తి బాధ్యత వహించాలన్నారు. హెల్పేజ్ ఇండియా హైదరాబాద్ ప్రతినిధి శ్యామ్‌కుమార్ పవర్ పాయింట్ ద్వారా చట్టంలో పొందుపర్చిన అనేక అంశాల్ని తెలియజేశారు. ట్రైనీ ఐపీఎస్ అంకిత్ శాంక్వార్, సీడబ్ల్యూసీ సభ్యుడు దామోదర్, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డి, సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సయ్య, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి యుగేందర్, రాజేందర్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నమ్మించి.. లైంగిక దాడి

● కోమటిపల్లిలో ఘటన
● పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు

హసన్‌పర్తి: స్నేహితుడి..స్నేహితురాలిపై కన్నేసిన ఓ ఫ్రెండ్.. ఆమెపై లైంగిక దాడికి పాల్పడాడు. ఈ ఘటన కోమటిపల్లి శివారులో ఆలస్యంగా వెలుగు చూసింది. మునుగోడుకు చెందిన ఇద్దరు విద్యార్థులు..ఉమ్మడి వరంగల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థినులు నగరంలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో చదువుతూ హాస్టల్‌లో ఉంటున్నారు. వీరు నలుగురు స్నేహితులు. ఈ క్రమంలో ఆదివారం వాజేడు వాటర్ ఫాల్స్ చూడడానికి రెండు బైక్‌లపై వెళ్లి తిరిగి హన్మకొండకు పయనమయ్యారు. మధ్యలోనే ఓ విద్యార్థిని తన ఇంటికి వెళ్లింది. అక్కడ నుంచి ముగ్గురు కోమటిపల్లికి చేరుకున్నారు. అనంతరం నీళ్లు కావాలని తన స్నేహితుడిని షాపుకు పంపించాడు. కాగా, తన స్నేహితురాలిని..స్నేహితుడి వద్ద వదిలి వెళ్లాడు. మద్యం మత్తులో ఉన్న స్నేహితుడు... తన ఫ్రెండ్స్ స్నేహితురాలిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీనిపై బాధితురాలు కేయూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కాగా, నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిసింది. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా విచారణ జరుపుతున్నట్లు వెల్లడించారు.

భీమారంలో వివాహితపై..

హసన్‌పర్తి: నగరంలోని భీమారానికి చెందిన ఓ వివాహితపై ఇద్దరు యువకులు లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితురాలు సోమవారం కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. భీమారానికి చెందిన సంగాల ప్రవీత్, శరత్ లైంగిక దాడికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కేయూ పోలీసులు తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ఖిలా వరంగల్: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి.. ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడాడు. ఈ ఘటన వరంగల్ దూపకుంట రోడ్డులోని గిరిప్రసాద్‌నగర్‌లో జరిగింది. స్థానికులు కథనం ప్రకారం వరంగల్ శంభునిపేట గిరిప్రసాద్‌నగర్‌కు చెందిన ఫహిమా, ఆయూబ్(57) దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. పిల్లలందరి వివాహాలు అయ్యాయి. ఈ క్రమంలో ఆర్థికంగా ఇబ్బందులతో మనోవేదనకు గురైన ఆయూబ్ సోమవారం ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్సై సాంబయ్య ఘటనా స్థలిని సందర్శించి ఆత్మహత్యకు గల కారణాలను సేకరించారు. మృతుడి కుమారుడు అక్బర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'ఇంటింటా ఇన్నోవేటర్'కు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్/కాశిబుగ్గ సెంటర్: గ్రామీణ ఆవిష్కర్తలను ప్రోత్సహించేందుకు ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడే అన్నారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీవత్స, ఆర్డీఓలు మహేందర్‌జీ, శ్రీనివాసులు, డీఆర్‌డీఏ సంపత్‌రావు, జేడీ అగ్రికల్చర్ ఉషా దయాల్, డీఈఓ వాసంతి తదితర శాఖల అధికారులతో కలిసి ఇంటింటా ఇన్నోవేటర్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్ (టీఎస్‌ఐసీ) ఆధ్వర్యంలో 2023 సంవత్సరానికి గాను విద్యార్థులు, రైతులు, మహిళలు, విద్యావేత్తలు ఎవరైన ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు. ప్రాజెక్టు రూపకర్తలు తమ ప్రయోగ ఆవిష్కరణలను కేవలం వాట్సాప్ ద్వారానే ఆగస్టు 5వ తేదీలోపు పంపాలన్నారు. ప్రాజెక్టుకు సంబంధించి ఆరు వ్యాక్యాలు, రెండు నిమిషాల నిడివి ఉన్న వీడియో, నాలుగు ఫొటోలు, ఆవిష్కర్త ఫొటో, చిరునామాను 9100678543 నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపించాలని కోరారు.

అర్జీలను వెంటనే పరిష్కరించాలి

కలెక్టర్ సిక్తా పట్నాయక్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

కాజీపేట: ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యమిస్తూ ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. హనుమకొండ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 118 మంది ఫిర్యాదులు అందాయి. డీఆర్డీఓ శ్రీనివాస్ కుమార్, డీఆర్‌ఓ వాసుచంద్ర, సీపీఓ సత్యనారాయణరెడ్డి ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వరంగల్‌లో..

వరంగల్: వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలో వివిధ సమస్యలపై 67 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే మాట్లాడుతూ ప్రజలు వారి సమస్యలను పరిష్కరించుకునేందుకు నేరుగా కలెక్టర్ కార్యాలయానికి వచ్చి చెప్పుకోవాలని సూచించారు. గ్రీవెన్స్‌లో మొత్తం 67 వినతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీవత్స, ఆర్డీఓలు మహేందర్‌జీ, శ్రీనివాసులు, డీఆర్‌డీఓ సంపత్‌రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ అమలు చేయాలి

● మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులకు కేయూ ఎన్టీఓ, నాల్గవ తరగతి ఉద్యోగుల అసోసియేషన్ వినతి



విద్యాశాఖమంత్రి సబితాఇంద్రారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ విశ్వవిద్యాలయంలో 2013లో నియామకమైన 80 మంది బోధనేతర, ఇతర ఉద్యోగులకు పీఆర్‌సీ అమలు చేయాలని కేయూ ఎన్టీఓ, నాల్గవ తరగతి సంఘాల బాధ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో విద్యాశాఖ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు వినతి పత్ర అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న బోధనేతర, విశ్రాంత ఉద్యోగులకు పీఆర్‌సీ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం 2021 ఆగస్టులో జీవో జారీ చేసిందన్నారు. దీనికి అనుగుణంగా ఉస్మానియా, కాకతీయ, తెలుగు, శాతవాహన, జేఎన్‌టీయూ మహాత్మా గాంధీ, వ్యవసాయ, ఉద్యానవన, వెటర్నరీ, తెలంగాణ, పాలమూరు విశ్వవిద్యాలయాల్లో అమలవుతుందన్నారు. కాని కేయూలో మాత్రం 2013లో నియామకమైన 80 మంది ఉద్యోగులకు వర్తించడం లేదన్నారు. దీనిపై స్పందించి తమకూ వర్తింపజేయడంతోపాటు యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. అలాగే, ఇవే సమస్యలపై శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్, వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కేయూ ఎన్టీఓ, నాల్గవ తరగతి ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లకావత్ యాదగిరి, వల్లాల తిరుపతి, మహమ్మద్ అబ్దుల్ శుకూర్, పి. కొమురయ్య, ఎతిరాజుల సతీశ్ బాబు, పి. అంకూశ్ పాల్గొన్నారు.

వర్గీకరణకు చట్టబద్ధత ఎప్పుడు?

● ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్



మాట్లాడుతున్న గోవిందు నరేశ్

కేయూ క్యాంపస్: జూలై 8వ తేదీన వరంగల్‌కు వస్తున్న ప్రధాని మోదీ.. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత ఎప్పుడో చెప్పాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్య క్షుడు గోవిందు నరేశ్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కేయూ అతిథి గృహంలో ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నరేశ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఎస్సీ వర్గీకరణ విషయంలో చొరవ తీసుకుని ప్రధానితో ప్రకటన చేయించాలని కోరారు. కాగా, ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి ఈ నెల 7వ తేదీతో 29 సంవత్సరాలు అవుతుందన్నారు. ఈ సందర్భంగా 29వ ఆవిర్భావ మహాసభను వరంగల్‌లోని ఓ సిటీ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభలో ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి, ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడి కరుణాకర్, కేయూ ఇన్‌చార్జి వడ్డేపల్లి మధుకర్, ఎంఎస్‌పీ జాతీయ నేత కడార్ల నవీన్ చారి, గోవిందు శాంతి కుమార్, ప్రేమ్ కుమార్, దూడపాక వెంకటేష్, జన్నే భాస్కర్, పెండ్యాల నిశాంత్, ప్రశాంత్, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ చెల్లింపులను ప్రోత్సహించాలి

● ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు



మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు

హన్మకొండ: ఆన్‌లైన్ విద్యుత్ బిల్లుల చెల్లింపులను ప్రోత్సహించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు సూచించారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని సీజీఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరివికాస్‌లో పెండింగ్ ఉన్న సర్వీసులను సకాలంలో మంజూరు చేయాలన్నారు. అలాగే, కాలిన, ఆగిన మీటర్లను మార్చాలన్నారు. సంవత్సరం పైబడిన వర్క్ ఆర్డర్స్ పూర్తయ్యేలా చూడాలన్నారు. సబ్‌స్టేషన్‌ల నిర్వహణ ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. దత్త గ్రామాల సమస్యలు పరిష్కరించాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలన్నారు. అక్రమంగా వినియోగిస్తున్న సర్వీసులను గుర్తించి వాటికి మీటర్లు అమర్చడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వర రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, పి.మోహన్ రెడ్డి, వి.తిరుపతిరెడ్డి, సీజీఎంలు అశోక్ కుమార్, టి.సదర్ లాల్, వి.మోహన్ రావు, సి.ప్రభాకర్, కె.కిషన్, కె.ఎస్.గుట్ట, రాజుచౌహాన్, భీకంసింగ్, రవీంద్రనాథ్, జాయింట్ సెక్రటరీ కె. రమేష్, కంపెనీ కార్యదర్శి కె.వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

బీసీ రాయ్‌ని ఆదర్శంగా తీసుకోవాలి

ఎంజీఎం: బీసీ రాయ్‌ని ఆదర్శంగా తీసుకుని ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ.. ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేయాలని డీఎంహెచ్‌ఓ సాంబశివరావు వైద్యులకు సూచించారు. అంతర్జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలు, హెల్త్‌అండ్ వెల్‌నెస్ కేంద్రాలు, ఆర్‌బీఎస్‌కే, బస్తీ దవాఖాన వైద్యులతో కలిసి డాక్టర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోవిడ్ సమయంలో వైద్యులు విలువైన సేవలందించారని, ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా చేపట్టిన వివిధ చర్యల వల్ల మరణాల రేటు, శిశు మరణాల రేటు చాలా తగ్గిందన్నారు. డాక్టర్లు తమ పరిధిలోని ఇతర ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రజలు డాక్టర్లను దేవుళ్ల ప్రతిరూపంగా భావిస్తారని వారిపై చిత్తశుద్ధితో సేవలందించాలన్నారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌ఓ, ప్రోగ్రాం అధికారులను ఘనంగా సత్కరించారు. అడిషనల్ డీఎంహెచ్‌ఓ మదన్‌మోహన్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ యాకుబ్‌పాషా, ప్రోగ్రాం అధికారులు వాణిశ్రీ, హిమబింధు, తదితరులు పాల్గొన్నారు.

రక్తమోడిన రహదారులు..




శ్రీనివాస్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్: కుక్కను తప్పించబోయిన కారు.. అదుపుతప్పి బోల్తాడింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. రూరల్ ఎస్సై బి.రామ్‌చరణ్ కథనం ప్రకారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ కాలనీకి చెందిన తన్నీరు శ్రీనివాస్ (58).. భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కలిసి కొంతకాలంగా వరంగల్‌లోని గిర్మాజీపేట విశ్వకర్మ వీధిలో నివాసం ఉంటున్నారు. వృత్తి రీత్యా జాతకాల రాళ్లు, రోల్డ్‌గోల్డ్ వ్యాపారం చేసే శ్రీనివాస్.. తన కుమారుడు చక్రధర్‌తో కలిసి కారులో మహబూబాబాద్‌కు వచ్చారు. అక్కడ నుంచి భద్రాచలం వెళ్తున్నారు. చక్రధర్ డ్రైవింగ్ చేస్తుండగా శ్రీనివాస్ పక్కనే కూర్చున్నారు. కారు.. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి జమాండ్లపల్లి బ్రిడ్జి దాటగానే కుక్క అడ్డురావడంతో దానిని తప్పించబోయే క్రమంలో అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో శ్రీనివాస్ అపస్మారకస్థితికి చేరుకోగా చక్రధర్‌కు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా శ్రీనివాస్‌ను పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని ధ్రువీకరించారు. ఘటనా స్థలిని రూరల్ ఎస్సై రామ్‌చరణ్, ఏఎస్సై సూరయ్య, పీసీ గౌతమ్ పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపరిచి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న బైక్.. ఇద్దరి దుర్మరణం





యువకుల మృతదేహాలు

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందారు. వరంగల్ గాయత్రీనగర్‌కు చెందిన బొంతు అఖిల్ (23), ఎస్‌ఆర్‌ఆర్ తోటకు చెందిన కొలిపాక శ్రీకాంత్(29).. బైక్‌పై వరంగల్ నుంచి హన్మకొండకు వస్తున్నారు. ఈ క్రమంలో హంటర్‌రోడ్డులోని పెట్రోల్‌పంపు వద్ద వేగంగా వస్తూ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నారు. దీంతో తీవ్ర గాయాలపాలైన ఇద్దరిని ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. దీనిపై బొంతు అఖిల్ బావ పెరుమాండ్ల అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ షుకూర్ తెలిపారు.